యథేచ్ఛగా ఇసుక దోపిడీ

తాడిపత్రి సమీపంలోని పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమ సంపాదనే ధ్యేయంగా కొందరు ఇసుకాసురులు ప్రకృతి వనరులను దోచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం కొలువయ్యాక సహజ వనరులను అందినదాడికి దోచేస్తూ జేబులు నింపుకుంటున్నారు. అయినా సంబంధిత అధికారులు తమకేమీ తెలీనట్లు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- చోద్యం చూస్తున్న పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు


పెన్నాలో పాత బ్రిడ్జికి పడమర వైపు ఇసుకను అక్రమంగా తరలించేందుకు వచ్చిన ట్రాక్టర్లు

తాడిపత్రి: పట్టణంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతంది. ఇసుక తవ్వకాలను నిరోధించాల్సిన మైన్స్, రెవెన్యూ, పోలీసు వ్యవస్థలు ఇవేమీ తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. ఇసుకాసురులు పట్టపగలు అందరి కళ్లెదుటే పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా పట్టణ సమీపంలోని పెన్నానదిలో ఇసుకను తోడేస్తున్నారు. ఇసుక తవ్వకాలనూ అధికారులు, పోలీసులు రోజూ చూస్తూనే ఉంటారు. అప్పుడప్పుడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని, తాము నిబద్ధతతో పని చేస్తున్నామని పత్రికలకు, మీడియాకు పోలీసులు ఓ ప్రకటన విడుదల చేస్తూ మమ అనిపించుకుంటున్నారే తప్ప.. రేయింబవళ్లు ఇసుకను తోడేస్తున్న తోడేళ్లను మాత్రం ఎవరూ నియంత్రించలేకపోవడం గమనార్హం.

ప్రకటనలకే పరిమితమైన అధికారులు

అక్రమ ఇసుక, మట్టి దందాలపై చర్యలు తీసుకుని ఆయా వాహనాలను సీజ్ చేసే అధికారం రెవెన్యూ, మైన్స్ అధికారులకు ఉన్నప్పటికీ వారు వాటి వైపు కన్నెత్తి చూడరు. అడపాదడపా పోలీసులు అక్రమ ఇసుక, మట్టి వాహనాలను (అధికార పార్టీ అండదండలు ఉన్న వారివి కాకుండా) పట్టుకుంటుంటారు. కానీ రెవెన్యూ, మైన్స్ శాఖల అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మీడియా రిపోర్టర్లు లాంటి అక్రమాలపై వివరణ అడిగిన సమయంలో 'మా దృష్టికి రాలేదని, తగిన చర్యలు తీసుకుని, అక్రమ మైనింగ్‌ను అరికడతాం' అని భలే గొప్పగా కవర్ చేస్తుంటారు. తీరా మరుసటి రోజు నుంచి యథా అధికారులూ, తథా మైనింగ్ మాఫియా అన్నట్లు ఇసుకాసురులు బరితెగించి మరీ ప్రకృతి సహజ సంపదను దోచేస్తూ రూ.లక్షలు ఆర్జిస్తుంటారు. తద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండికొడుతుంటారు. పెన్నానది పాత బ్రిడ్జి సమీపంలో ఇసుకను తవ్వుకుపోతున్నారంటే ఆయా శాఖల అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోందని చెప్పవచ్చు. ఇది రోజూ జరిగే తంతు అయినప్పటికీ నియంత్రించాల్సిన ఆయా శాఖల అధికారులు మిన్నకుండిపోతుండడంపై ఇసుకాసురులతో ఏమైనా లాలూచీ పడ్డారా అన్న అనుమానాలు కలుగకమానదు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అక్రమాలకు అడ్డుకట్ట

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమ రవాణా ఎక్కడా జరగకుండా గట్టి చర్యలు చేపట్టింది. దీంతో ఎక్కడా ప్రకృతి సహజ వనరుల ధ్వంసానికి చోటు ఉండేది కాదు. దీనికి తోడు ప్రజావసరాలు, నిర్మాణదారులకు మేలు జరిగేలా ఇసుకను అతి తక్కువ ధరకు అదీనూ కేటాయించిన ప్రాంతాల్లో మాత్రమే ఇసుకను తవ్వేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సహజ వనరులను దోచేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా, అక్రమంగా ఇసుక, మట్టిని తవ్వుకుని లక్షలాది రూపాయలను సంపాదిస్తూ టీడీపీ నాయకులు జేబులు నింపుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను పోలీసులకు పట్టించి, ఆయా వాహనాలపై కేసులు నమోదు చేయాలని ఏకంగా తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన చేపట్టిన విషయం తాడిపత్రి ప్రజలకు తెలిసిందే, అనంతరం కాలంలో ఆయన తండ్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అక్రమ ఇసుక ట్రాక్టర్లపై చర్యలు తీసుకోవడంలో భాగంగా వాటి టైర్లలోని గాలిని తీసివేసిన విషయం కూడా ప్రజలకు బాగా తెలిసిందే. కానీ ఇప్పుడు అలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదన్న అన్న అనుమానాలు బలపడుతున్నాయి.

ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేయాలి



ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయాలి. భూగర్భ జలాలు అడుగంటిపోకుండా చర్యలు చేపట్టడంలో భాగంగా సరైన ప్రదేశాలను ఎంపిక చేయడం ద్వారా అటు ప్రభుత్వానికి ఇటు రైతులకు మేలు చేకూరుతుంది. అంతేకానీ ఎలా పడితే అలా ఎక్కడ పడితే అలా అక్రమంగా ఇసుకను తవ్వితే భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉంది, పట్టణ సమీపంలోని పెన్నానదిలో అక్రమంగా ఇసుకను తరలించడం ద్వారా తాగునీటి సమస్య ఏర్పడే అవకాశముంది.

– రాజారామిరెడ్డి, రైతు సంఘం మండల కార్యదర్శి

చర్యలు తీసుకుంటాం



అక్రమ ఇసుక రవాణాను అరికడతాం. ఆయా గ్రామాల పరిధిలో పెన్నా పరీవాహక ప్రదేశాల్లో , వాగులు, వంకల్లో అక్రమంగా ఇసుకను తరలించకుండా పోలీసు అధికారులతో కలసి తగిన చర్యలను తీసుకుంటున్నాం . ఇదివరకే ఆయా గ్రామ వీఆర్వో, వీఆర్ఏలకు గట్టి హెచ్చరికలను జారీ చేశాం. ఎవరైనా అక్రమంగా వాహనాల్లో ఇసుకను తరలిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా పోలీసు అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో పాటు ఇసుక అక్రమ రవాణాదారులకు రూ. 10 వేల వరకూ జరిమానా విధిస్తున్నాం.

– రజాక్‌వలి, తహసీల్దార్, తాడిపత్రి

రైతుల రేషన్‌కార్డుల తొలగింపు అన్యాయం


తహసీల్దార్ రజాక్‌వలికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

తాడిపత్రి: తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ ఆయకట్టు రైతులకు నీరు ఇవ్వకుండా ఉండడంతో పాటు ఆయా రైతుల పొలాలు తడి భూముల కింద చూపి రేషన్ కార్డులను తొలగించడం అన్యాయమని మండల రైతు సంఘం నాయకుడు రాజారామిరెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ఆయన తాడిపత్రి మండలంలోని చిన్నపొడమల, పెద్దపొడమల, చిన్నపల్లి, తాతగారిపల్లి, ఎర్రగుంటపల్లి, తేరన్నపల్లి, తిమ్మాపురం, దిగువపల్లి, కొనగుంటపల్లి గ్రామాలకు చెందిన రైతులతో కలసి తహసీల్దార్ రజాక్‌వలికి వినతిపత్రం అందజేశారు. బ్రాంచ్ కెనాల్ క్రింద ఉన్న మూడు డిస్ట్రిబ్యూటరీల ద్వారా రైతులకు సాగునీరు వదులుతామని అధికారులు రికార్డుల్లో నమోదు చేసుకుని, ఇప్పటి వరకు సాగు నీరు వదల్లేదన్నారు. రైతులకు రేషన్‌కార్డులను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజేశ్వర్‌నాయుడు, శేఖర్‌నాయుడు, రంగయ్య, మల్లిఖార్జున, లలితమ్మ, లోక్‌నాథ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

90 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ అందించాలి


తహసీల్దార్, ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

శింగనమల: రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ అందించాలని సీపీఎం నాయకులు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీపీఎం నాయకులు రైతులతో కలసి తహసీల్దార్ బ్రహ్మయ్య, ఏఓ. అన్వేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ ఎకరాల ప్రకారం కాకుండా ప్రతి రైతుకూ 5 ప్యాకెట్లు వేరుశనగ అందించాలన్నారు. వర్షాలు ముందస్తుగా వస్తున్నాయని, అయినా ఇంతవరకు వేరుశనగ విత్తన కాయలు రైతు సేవా కేంద్రాలకు చేరలేదన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు ముందస్తుగా విత్తన వేరుశనగ పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

నేడు భగవద్గీత శ్లోకాల పోటీలు

గుంతకల్లు: పామిడిలోని దత్తపాదుకా క్షేత్రంలో 1 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం నిర్వహిస్తున్న భగవద్గీత శ్లోకా పోటీలను జయప్రదం చేయాలని ఆ క్షేత్రం కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీధర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తరగతుల వారీగా మూడు విభాగాల్లో భగవద్గీత 12వ అధ్యాయనంలోని శ్లోకాలపై స్వరణ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ మూడు విభాగాల్లో ఇద్దరు చొప్పున విజేతలకు మైసూర్ పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ 83వ జన్మదినమైన 26వ తేదీ బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం


భద్రావతి, భవనారుషీశ్వరుల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని మార్కండేయస్వామిఆలయంలో సోమవారం భద్రావతి, భావనరుషీశ్వరుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. వేదమంత్రాల నడుమ భద్రావతి, భావనారుషీశ్వరుల కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు హాజరై కల్యాణోత్సవం తిలకించారు.

ఆర్టీటీకి అండగా నిలుద్దాం


ర్యాలీ నిర్వహిస్తున్న సేవ్ ఆర్టీటీ జేఏసీ సభ్యులు

నార్పల: ఉమ్మడి జిల్లాల్లో సేవలందిస్తున్న ఆర్టీటీకి కులమతాలు,రాజకీయాలకు అతీతంగా అండగా నిలవాలని జెడ్పీ వైస్ చైర్మన్ వేదాంతం నాగరత్నమ్మ, జేఏసీ కన్వీనర్, సర్పంచు రామాంజనేయులు కోరారు. సోమవారం సేవ్ ఆర్టీటీ జేఏసీ సభ్యులు మండల కేంద్రంలో ఆర్టీటీకి మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆర్టీటీ వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపిందన్నారు. అలాంటి గొప్ప సంస్థకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ కో కన్వీనర్ రంగాపురం పుల్లప్ప,కమిటీ సభ్యులు శివయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్టు అధికారులకు నెమలి అప్పగింత


ఎస్‌ఐ వెంకటరమణకు నెమలిని అప్పగిస్తున్న నారాయణస్వామి కాలనీ వాసులు

యాడికి: మండల కేంద్రంలోని నారాయణ స్వామి కాలనీలో సోమవారం ఇద్దరు పిల్లలకు నెమలి దొరికింది. ఈ విషయాన్ని కాలనీ వాసులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు నెమలిని స్వాధీనం చేసుకున్నారు. గుత్తి ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి నెమలిని అడవిలో వదిలారు.

ఐరన్ షాపులో చోరీకి విఫలయత్నం

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఇక్బాల్ ఐరన్ షాపులో దొంగలు ఆదివారం అర్ధరాత్రి సమయంలో చోరీకి విఫలయత్నం చేశారు. దొంగలు షాపు పైభాగంలో కన్నం వేసి లోపలికి చొరబడ్డారు. క్యాష్ బాక్సును ఓపెన్ చేశారు. అందులో డబ్బు లేకపోవడంతో. కొన్ని విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై ర్యాలీ



గుంతకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు/పామిడి: ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై పట్టణంలో సోమవారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్ నుంచి ప్రధాన రహదారి మీదుగా ఎన్‌టీఆర్ సర్కిల్ జాతీయ జెండాలను చేత పట్టుకొని తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గుమ్మనూరు నారాయణస్వామి, బండారు ఆనంద్, గుజారీ ఖాజా, మణికంఠ, కొలిమి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే సిందూర్ ఆపరేషన్ సక్సెస్‌పై పామిడిలో మాజీ సైనిక ఉద్యోగుల ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. అందులో భాగంగా స్థానిక సరస్వతీ విద్యామందిరం వద్ద నుంచి భారత జెండాలు చేతబూని శోభాయాత్ర ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మిలటరీ సైనిక ఉద్యోగుల సంఘం సభ్యులు ఎంఎస్ ఈశ్వరయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నీలం సంజీవరెడ్డి జయంతి


కల్లూరులో మాజీ రాష్ట్రపతి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో సోమవారం మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా పలువురు నాయకులు సంజీవరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రపతిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా నీలం సంజీవరెడ్డి పనిచేశారన్నారు. యువత ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో జంబులదిన్నె సొసైటీ మాజీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, ఏకే నరసింహులు, చీమల కేశవయ్య, నల్లపరెడ్డి, రామచంద్రారెడ్డి, పెద్దన్న, చంద్రనాథ్‌రెడ్డి, ఓబిరెడ్డి, ఆదినారాయణ రెడ్డి, పుల్లారెడ్డి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయాలను కొనసాగిస్తాం


గుంతకల్లులో సుందరయ్య చిత్ర పటం వద్ద నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు


బీకేఎస్‌లో మజ్జిగ పంపిణీ చేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

గుంతకల్లుటౌన్/బుక్కరాయసముద్రం: ప్రజల పక్షాన పోరాటాలు సాగించిన కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాల సాధనకు పాటుపడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి తెలిపారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో 40వ వర్ధంతి సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు డి.శ్రీనివాసులు, నాగరాజు, తిమ్మప్ప, ఎస్.కె.ఎం.బాషా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో సీపీఎం, సీఐటీయూ, పంచాయితీ వర్కర్స్ యూనియన్ ఆద్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, మండల కార్యదర్శి కుల్లాయప్ప నాయకులు శివారెడ్డి, నెట్టికల్లయ్య, నాగేంద్ర, కొండప్ప, నాగరాజు, చెన్నప్ప, రఫి తదితరులు పాల్గొన్నారు.

మండల అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు


ఫిర్యాదును చూపుతున్న జెడ్పీటీసీ భాస్కర్

బుక్కరాయసముద్రం: ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలకు అందించడంలో మండల అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ నీలం భాస్కర్, దయ్యాలకుంటపల్లి ఎంపీటీసీ శివారెడ్డి సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలకు అందాలంటే గ్రామస్థాయిలో టీడీపీ నాయకులను అడిగితే పథకాలను వర్తింప చేస్తామని అధికారులు చెప్పడం దారుణమన్నారు. మండలంలో గోకుల షెడ్లు అర్హులకు మంజూరు చేయలేదన్నారు. ఎమ్మెల్యే చెబితేనే మంజూరు చేస్తామని ఎంపీడీఓ చెప్పడం సరికాదన్నారు.

మట్కా బీటర్ అరెస్టు

యాడికి: మండలంలోని వేములపాడు గ్రామంలో మట్కా రాస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటరమణ సోమవారం తెలిపారు. అతడి నుంచి రూ.4,750 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

క్లుప్తంగా

ఏపీజీఈఏ కమిటీ ఎన్నిక


గుంతకల్లు తాలూకా కార్యవర్గ సభ్యులు

గుంతకల్లుటౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంతకల్లు తాలూకా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ, ఎన్నికల అధికారి రామునాయక్ తెలిపారు. స్థానిక మండీబజార్‌లోని సచివాలయంలో జరిగిన సాధారణ సమావేశం అనంతరం తాలూకా కమిటీ అధ్యక్షుడిగా మంజునాథ్, అసోసియేట్ అధ్యక్షురాలిగా డాక్టర్ సుజాత, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, ఆదినారాయణను ఎన్నుకున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా కళ్యాణ్ చక్రవర్తి, సంయుక్త కార్యదర్శులుగా జయమ్మ, అశ్విని, భాగ్యలక్ష్మి, పెన్నయ్య, రామాంజనేయులు, కోశాధికారిగా పుష్పమి ఎన్నికయ్యారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని నిరుపేద మహిళ కేసరి రాణికి వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి హరిబాబు ఆర్థిక సాయం అందజేశారు. వివరాలు.. స్థానిక సీఐటీయూ కాలనీలో 10 రోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో నిరుపేద మహిళ కేసరి రాణికి చెందిన రేకుల షెడ్ దగ్ధమై నష్టపోయిన విషయం విదితమే. గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు దాసరి హరిబాబు సోమవారం బాధిత మహిళ కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల నగదుతో పాటు దుస్తులు అందజేసి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

కోనుప్పలపాడు తలారి మృతి


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్

యాడికి: మండలంలోని కోనుప్పలపాడు గ్రామానికి చెందిన తలారి వెట్టి పెద్ద కంబన్న (62) సోమవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి కోనుప్పలపాడుకు వెళ్లి మృత దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల కోసం రూ.15 వేలు మృతుడి భార్య సంజమ్మ, కుటుంబ సభ్యులు లక్ష్మీదేవి, కంబగిరి, కరుణకు తహసీల్దార్ అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ క్రిష్టప్ప, వీఆర్ఐలు మృతదేహానికి నివాళులర్పించారు.

ఘనంగా కుంభాభిషేకం

యల్లనూరు: హనుమజ్జయంతి సందర్భంగా మండలకేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు పవన్‌కుమార్ తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

చలో వరంగల్ విజయవంతం చేయండి


ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెద్దవడుగూరు: వరంగల్ పట్టణంలో ఈనెల 31న నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ సన్మానసభకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు పెద్దపప్పూరు ఆదినారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు కత్తుల కొండయ్య, ఎంఎస్‌పీ గుత్తి ఈరన్న కోరారు. సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం షాదీఖానా ఆవరణలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మాదిగల అభివృద్ధి, సంక్షేమం కోసం మందకృష్ణ మాదిగ చేసిన ఉద్యమాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల నాయకులు గూడూరు రంగస్వామి, అప్పేచర్ల పెద్దులయ్య, కండ్లగూడూరు మారయ్య, రాజు, సుధాకర్‌రాజు, పలు గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు మంత్రి అభినందనలు


మాసినేని పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న మాసినేని ఉన్నత పాఠశాల విద్యార్థులు సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో అత్యంత ప్రతిభ కనబరిచారు. 45 మంది విద్యార్థులకు గాను అందరూ పాసయ్యారు. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, డీఈఓ ప్రసాద్‌బాబు, ఆర్ఐఓ వెంకటనాయక్, డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి తదితరులు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. సుశాంత్ రెడ్డి 500 మార్కులు గాను 480 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. పాఠశాల కరస్పాండెంట్ అమరేంద్ర, డైరెక్టర్ స్వాతి, ప్రిన్సిపాల్ కళ్యాణం శంకర్, ఇన్‌చార్జ్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణానికి విరాళం

యాడికి: స్థానిక రుక్మిణీ పాండురంగ స్వామి ఆలయ పునః నిర్మాణానికి మండల కేంద్రానికి చెందిన విజయకుమార్ తన తల్లిదండ్రులు తనికంటి కృష్ణవేణి, శేషాచలపతి జ్ఞాపకార్థం రూ.25 వేలు విరాళమిచ్చారు. సోమవారం కమిటీ సభ్యుడు ఆదిత్య పవన్‌కు ఆయన నగదు అందజేశారు. గుడి గోపురం, ప్రహరీ నిర్మాణానికి దాతలు సహకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

తూనికలు, కొలతలపై అవగాహన


మాట్లాడుతున్న జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్

గుత్తి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం అధికారులు తూనికలు, కొలతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్, జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్ మాట్లాడారు. వినియోగదారులు కొలతల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. వస్తువుల తయారీ తేదీ, ఎక్స్పైరీ తేదీలను గమనించాలన్నారు. ఎమ్మార్పీకే వస్తువులు విక్రయించాలన్నారు. నాణ్యత లోపించిన వస్తువులను విక్రయించకూడదన్నారు. వ్యాపారులు కొలతల్లో మతలబు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, ఆటో యూనియన్ అధ్యక్షుడు నాగార్జున, సీనియర్ సిటిజన్ ఓబులేసు, సామాజిక కార్యకర్త సాదిక్ బాషా, ఆటో నజీర్ తదితరులు పాల్గొన్నారు.

'బీటెక్ విద్యార్థిపై దాడి చేసిన వారిని శిక్షించాలి'

గార్లదిన్నె: చిత్తూరు జిల్లాలో బీటెక్ విద్యార్థిపై దాడి చేసిన వారిని చట్టపరంగా శిక్షించాలని అనంతపురం డివిజన్ ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యుడు లోలూరు కుళ్లాయప్ప డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలో బీటెక్ విద్యార్థి జేమ్స్‌ను రౌడీ షీటర్లు కిడ్నాప్ చేసి రెండు రోజులు బంధించి, చిత్రహింసలకు గురిచేస్తూ నోట్లో మూత్రం పోసి, కులం పేరుతో దూషిస్తూ కిరాతకంగా దాడి చేయడం దారుణమన్నారు. దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేస్తే పోలీసులు కొన్ని పేర్లు తొలగిస్తే కేసు నమోదు చేస్తామని చెప్పడం సరైంది కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి దళిత విద్యార్థిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు ఇల్లూరులో గ్రామ దేవర

గార్లదిన్నె: మండలంలోని ఇల్లూరులో మంగళవారం గ్రామ దేవర నిర్వహించనున్నారు. సోమవారం గ్రామస్తులు మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలు, పాడి పంటలతో సమృద్ధిగా ఉండాలని పెద్దమ్మ దేవర నిర్వహిస్తున్నామన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా బందోబస్తు ఏర్పాటు చేశారు.

గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా!


అధికారుల హాజరు పట్టిక

యల్లనూరు: ప్రజా ఫిర్యాదుల విభాగం కార్యక్రమానికి కీలక శాఖ అధికారులు డుమ్మా కొట్టారు. మండలంలో 16శాఖలు ఉండగా ఐదారు శాఖల అధికారులు మాత్రమే సోమవారం హాజరయ్యారు. తహసీల్దార్ లేకపోవడంతో మండల స్థాయి అధికారులు బాధ్యతలను మరిచారు. కొందరు అధికారులు సొంత పనుల్లో నిమగ్నమై కాలక్షేపం చేస్తున్నారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి అధికారులే హాజరుకాకపోతే ఎలా అని పలువురు రైతులు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.